




# EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
06 మే 2024
పేజీలు: 02




## పాయింట్స్ టేబుల్


| టీమ్ | ఆడినవి | గెలిచినవి | ఓడినవి | రన్ రేట్ | పాయింట్స్ |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 11 | 8 | 3 | 1.45 | 16 |
| రాజస్తాన్ | 10 | 8 | 3 | 0.62 | 16 |
| చెన్నై | 11 | 6 | 5 | 0.70 | 12 |
| హైదరాబాద్ | 11 | 6 | 4 | 0.07 | 12 |
| లక్నో | 11 | 6 | 5 | -0.37 | 12 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | -0.44 | 10 |
| బెంగళూరు | 11 | 4 | 7 | -0.04 | 8 |
| పంజాబ్ | 11 | 4 | 7 | -0.18 | 8 |
| గుజరాత్ | 11 | 4 | 7 | -1.32 | 8 |
| ముంబై | 11 | 3 | 8 | -0.35 | 6 |

## రాంచీలో ఈడీ దాడులు



జార్ఖండ్ రాజధాని రాంచీలోని పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోమవారం వరుస దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లెక్కల్లో చూపని సుమారు రూ.25 కోట్ల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో కొన్ని పథకాల అమలులో అవకతవకలు జరగడంతో మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో గతేడాది ఫిబ్రవరిలో ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ వీరేంద్ర రామ్‌ను ఈడీ అరెస్టు చేసింది. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఈడీ అధికారులు ఇవాళ రాంచీలోని సుమారు 10 ప్రాంతాల్లో ఏకాలంలో వరుస దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రి ఆలంగీర్ ఆలం వ్యక్తిగత సహాయకుడు సంజీవ్ లాల్ నౌకర్ ఇంట్లో కట్టలు కట్టలుగా నగదు బయటపడింది.

## ఏపీ ఇన్‌చార్జి డీజీపీగా శంఖబ్రత బాగ్చీ




ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి శంఖబ్రత బాగ్చీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. డీజీపీ నియామకంపై ఈసీ తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు ఆయన ఆ పదవిలోకొనసాగనున్నారు. కాగా, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ ఆదివారం వేటువేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఆయనను బదిలీ చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీచేసింది. సోమవారం ఉదయం11 గంటల్లోగా ముగ్గురు డీజీ ర్యాంకు అధికారుల జాబితా పంపాలని ఆదేశించింది. వారిలో నుంచి ఒకరిని డీజీపీగా ఎంపిక చేయనుంది. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్ అయిన బాగ్చీ తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా, నూతన డీజీపీ ఎంపిక జాబితాలో సీహెచ్ తిరుమల రావు, అంజనా సిన్హా, మాదిరెడ్డి ప్రతాప్‌లు ఉన్నారు. తిరుమల రావు, అంజనా సిన్హా 1990వ బ్యాచ్ ఐపీఎస్ అధికారులు కాగా, మాదిరెడ్డి ప్రతాప్ 1991వ బ్యాచ్‌కు చెందినవారు. తిరుమల రావు ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉండగా, అంజనా సిన్హా రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఎవరికో ఒక్కరికి ఏపీ డీజీపీగా నియమించే అవకాశం ఉంది.




## నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్లు స్టార్ట్

ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రూ.200 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 25 వరకు ఫస్ట్ ఫేజ్ ప్రక్రియను చేపట్టనున్నారు. ఈసారి దోస్త్ యాప్‌లో సెల్ఫీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశాన్ని కల్పించారు. విద్యార్థులు మే 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూన్ 3న మొదటి విడత సీట్లను కేటాయిస్తారు.


### టైటానిక్ నటుడు
## బెర్నార్డ్ హిల్ ఇక లేరు



ప్రముఖ హాలీవుడ్ నటుడు, టైటానిక్ ఫేమ్ బెర్నార్డ్ హిల్ ఇక లేరు. 79 సంవత్సరాల వయసులో ఆయన కన్నుమూశారు. టైటానిక్ సినిమాలో ఆయన కెప్టెన్ ఎడ్వర్డ్ స్మిత్ పాత్రతో మెప్పించారు. భాషలతో సంబంధం లేకుండా అన్ని రకాల సినీ అభిమానులను బెర్నార్డ్ హిల్ ఆకట్టుకున్నారు. ఆయన భారతీయ సినీ అభిమానులకు కూడా సుపరిచితుడు. ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ తదితర చిత్రాల్లోనూ తన విలక్షణమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న నటుడు బెర్నార్డ్ హిల్. కాగా 1944లో యూకేలోని మంచెస్టర్‌లో బెర్నార్డ్ హిల్ జన్మించారు. మొదట పలు చిత్రాల్లో, టీవీ సీరియల్స్‌లో బెర్నార్డ్ హిల్ నటించారు. ఆయన మృతి పట్ల ప్రముఖులు, సినీ అభిమానులు సంతాపం తెలియజేస్తున్నారు. మా 123తెలుగు. కామ్ తరఫున బెర్నార్డ్ హిల్ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# హైదరాబాద్ vs ముంబై

ఐపీఎల్ 2024లో, సీజన్‌లోని 55వ మ్యాచ్ ముంబై ఇండియన్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య సోమవారం, మే 6న జరగనుంది. ఈ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు జరగనుంది. ప్రస్తుత సీజన్‌లో ఇరు జట్లు రెండోసారి తలపడనున్నాయి. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ముంబై జట్టుపై విజయం సాధించింది. MI ప్లేఆఫ్‌ల రేసు నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే SRH ఇప్పటికీ టాప్ 4 రేసులో స్థిరంగా ఉంది. పాయింట్ల పట్టికలో ముంబై ఇండియన్స్ స్థానం చాలా దారుణంగా ఉంది. హార్దిక్ పాండ్యా సారథ్యంలో ముంబై ఇండియన్స్ ఇప్పటి వరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో కేవలం 3 విజయాలు మాత్రమే నమోదు చేసింది. ఆ జట్టు తన గత నాలుగు మ్యాచ్‌లలో వరుస పరాజయాలను చవిచూసింది. ఇప్పుడు పరువు కోసం గెలవాలని కోరుకుంటుంది. బ్యాట్స్‌మెన్ నిలకడగా రాణించలేకపోవడం, బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా ఎటువంటి మద్దతు పొందలేకపోవడం ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌తో కనిపించిన రెండు అతిపెద్ద లోపాలుగా మారాయి. మరోవైపు, పాయింట్ల పట్టికలో, SRH 10 మ్యాచ్‌లలో 6 విజయాలతో 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తన తుఫాన్ బ్యాటింగ్ శైలితో ప్రత్యర్థి జట్లకు ఒకప్పుడు భయాన్ని కలిగించింది. కానీ, మధ్యలో కొన్ని మ్యాచ్‌లలో ఓడిపోవాల్సి వచ్చింది. అయితే, తమ చివరి మ్యాచ్‌లో ఆ జట్టు చివరి బంతికి రాజస్థాన్ రాయల్స్ వంటి బలమైన ప్రత్యర్థిని ఓడించి ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసింది. హైదరాబాద్ మునుపటిలా తన బ్యాట్స్‌మెన్స్ నుంచి వేగంగా, భారీ ఇన్నింగ్స్‌లను ఆశిస్తుంది. అదే సమయంలో, బౌలింగ్ విభాగం ఇప్పటివరకు చాలా మంచి పని చేసింది.





ఇరుజట్ల ప్రాబబుల్ ప్లేయింగ్ 11..
ముంబై ఇండియన్స్: ఇషాన్ కిషన్ (కీపర్), రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), నమన్ ధీర్, టిమ్ డేవిడ్, గెరాల్డ్ కోయెట్జీ, పీయూష్ చావ్లా, జస్ప్రీత్ బుమ్రా, నువాన్ తుషార.
సన్‌రైజర్స్ హైదరాబాద్: ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, అన్మోల్‌ప్రీత్ సింగ్, హెన్రిచ్ క్లాసెన్ (కీపర్), నితీష్ రెడ్డి, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, మార్కో జాన్సెన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్ కుమార్, టి. నటరాజన్.

### 16 శాతం ఓట్లు రాకుంటే..
## డిపాజిట్ గల్లంతే

ఎన్నికల సమయంలో డిపాజిట్ గల్లంతు అనే పదం వింటుంటాం. డిపాజిట్ అంటే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామపత్రాలు దాఖలు సమయంలో ఎన్నికల సంఘం నిర్ణయించిన రుసుమును రిటర్నింగ్ అధికారి వద్ద డిపాజిట్ చేస్తారు. ఫలితాల తర్వాత డిపాజిట్ రుసుము తిరిగి పొందాలంటే పోలైన ఓట్లలో ఆరో వంతు (16 శాతం) ఓట్లు పొందడం తప్పనిసరి. లేదంటే ఆ రుసుము ఎన్నికల సంఘానికే చెందుతుంది.



## నీట్ కటాఫ్ తగ్గే ఛాన్స్


ఈ సారి నీట్ ర్యాంకులను ఫిజిక్స్ ప్రశ్నలు నిర్దేశించనున్నాయి. ఫిజిక్స్ ప్రశ్నలను ఛేదించిన వారే మంచి ర్యాంకును పొందే అవకాశం ఉన్నది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ యూజీ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. ఈ పరీక్షలో ఫిజిక్స్ పేపర్ ప్రశ్నలు కఠినంగా ఉండటంతో విద్యార్థులు కాస్త ఇబ్బందిపడ్డారు. కానీ, మొత్తంమీద నీట్ పేపర్ మధ్యస్థంగా ఉన్నట్టు నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ సారి అత్యధికంగా ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచే ఇచ్చారు. ఎప్పుడూ కఠినంగా ఉండే కెమిస్ట్రీ సులభంగా ఉండగా, జీవశాస్త్రంలో జువాలజీ, బాటనీ సెక్షన్ల ప్రశ్నలు కూడా ఈజీగా ఉన్నట్టు విద్యార్థులు చెప్పారు. బాగా చదివిన వారు, మరీ ముఖ్యంగా ఎన్సీఈఆర్టీ పుస్తకాలు, సిలబస్ చదివిన వారు మెరుగైన స్కోర్ చేస్తారని నిపుణులు అంచనావేశారు. అయితే, నిరుటితో ఈ సారి పేపర్‌ను పోల్చితే కాస్త కఠినంగా ఉన్నట్టు లెక్చరర్లు అంచనా వేశారు.

### రఫాపై ఇజ్రాయెల్ దాడి..
## 16 మంది పాలస్తీనియన్లు మృతి



ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి చర్చలు విఫమయ్యాయి. దీంతో హమాస్‌కు ప్రధాన స్థావరంగా ఉన్న గాజాలోని రఫాపై ఇజ్రాయెల్ దాడులు ముమ్మరం చేసింది. హమాస్ దాడులకుప్రతిగా ఇజ్రాయెల్ బలగాలు విరుచుకుపడటంతో 16 మంది మరణించారు. రఫాపై వేర్వేరు చోట్ల నుంచి నగరంపై రెండు పర్యాయాలు దాడి జరిగిందని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపాయి. పెద్ద సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయని పేర్కొన్నాయి. ఇక గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 34,683 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు.

## 'దేవర' కోసం రొమాంటిక్ సాంగ్?



స్టార్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో 'యంగ్ టైగర్ ఎన్టీఆర్' హీరోగా రాబోతున్న పాన్ ఇండియా సినిమా 'దేవర పార్ట్ 1'. అక్టోబర్ 10న ఈ చిత్రం రిలీజ్ కాబోతుంది. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సినిమా పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమాలో అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ ను పెడుతున్నాడు కొరటాల శివ. అందులో భాగంగానే వచ్చే షెడ్యూల్ లో ఎన్టీఆర్ – జాన్వీ కపూర్ మధ్య ఓ రొమాంటిక్ సాంగ్ ను షూట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సాంగ్ లో ఎన్టీఆర్ స్టెప్స్ కూడా చాలా ట్రెండీగా ఉంటాయని.. ఫ్యాన్స్ కి ఫుల్ కిక్ ఇచ్చేలా ఉంటాయని తెలుస్తోంది. మే నాలుగో వారం నుంచి ఈ షెడ్యూల్ తాలూకు సన్నివేశాలను చిత్రీకరిస్తారని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాలో ఎన్టీఆర్ లుక్ కూడా అదిరిపోతోందట. అందుకు తగ్గట్టుగానే తన పాత్ర కోసం తారక్ కూడా డిఫరెంట్ మేకోవర్ ట్రై చేస్తున్నాడు. ఇప్పటికే, ఎన్టీఆర్ - కొరటాల కాంబినేషన్ లో గతంలో వచ్చిన 'జనతా గ్యారేజ్' పెద్ద హిట్ కావడంతో ఈ సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



నీట్ యూజీ.. అభ్యర్థికి బదులు పరీక్ష రాస్తూ

## పట్టుబడ్డ ఎంబీబీఎస్ స్టూడెంట్

రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో అభ్యర్థికి బదులు పరీక్ష రాస్తూ పట్టుబడ్డాడో ఎంబీబీఎస్ విద్యార్థి. దేశవ్యాప్తంగా ఆదివారం నీట్ యూజీ ప్రవేశ పరీక్ష జరిగింది. భరత్‌పూర్ జిల్లా మథురాలో ఉన్న ఓ పరీక్ష కేంద్రంలో అంతా పరీక్ష రాస్తున్నారు. ఈ క్రమంలో పరీక్ష కేంద్రంలోని ఓ గదిలో అభ్యర్థికి బదులు మరొకరు పరీక్ష రాస్తున్నట్లు ఇన్విజిలేటర్ గుర్తించారు. వెంటనే అతడిని పోలీసులకు పట్టించారు. విచారణ సందర్భంగా తన పేరు అభిషేక్ గుప్తా అని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేస్తున్నాని చెప్పాడు. రాహుల్ గుర్జర్ అనే అభ్యర్థికి బదులు తాను పరీక్ష రాస్తున్నాని వెల్లడించాడు. దీనికోసం అతని నుంచి ఇప్పటికే రూ.10 లక్షలు తీసుకున్నామని తెలిపాడు. తనతోపాటు మరో ఐదుగురు ఉన్నారని, తన సహ విద్యార్థి రవి మీనా కోసంమే ఈ పనిచేస్తున్నట్లు పేర్కొన్నాడు. వారంతా పరీక్షా కేంద్రం సమీపంలో ఓకారులో ఉన్నారని పోలీసులకు చెప్పారు. దీంతో పరీక్ష రాయాల్సిన అసలు విద్యార్థి రాహుల్ గుర్జర్‌ను, ఈ రాకెట్ నడుపుతున్న మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.



## మూడోసారి అంతరిక్ష యాత్రకు సిద్ధమైన సునీతా విలియమ్స్..

భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ మరోసారి అంతరిక్ష యాత్రకు సిద్ధమయ్యారు. బుచ్ విల్మోర్‌తో కలిసి అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. ఇద్దరు వ్యోమగాములు బోయింగ్ స్టార్‌లైనర్ స్పేస్‌షిప్‌లో ఈ నెల 7న స్పేస్‌లోకి దూసుకెళ్లనున్నారు. ఇంతకు ముందు బోయింగ్ కంపెనీ మానవ రహిత ప్రయోగాలు చేపట్టగా.. తొలిసారిగా మానవ సహిత యాత్ర చేపడుతున్నది. స్టార్‌లైనర్ స్పేస్‌షిప్ మంగళవారం ఉదయం 8.04 గంటలకు కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి ప్రయోగించనున్నారు.

## ప్లాస్టిక్ బియ్యాన్ని ఇలా గుర్తించండి!




మీరు కొన్న బియ్యం ప్లాస్టిక్ బియ్యమా? కాదా? అనేది తెలుసుకోవాలంటే కొన్ని బియ్యం గింజలను తీసుకుని కాల్చండి. కాలినప్పుడు వాసన వస్తే అవి ప్లాస్టిక్ బియ్యమని గుర్తించండి. వేడిగా ఉండే నూనెలో బియ్యం వేయడం వల్ల కూడా ప్లాస్టిక్ బియ్యాన్ని గుర్తించవచ్చు. ప్లాస్టిక్ బియ్యం నూనెలో కరిగి పాత్రకు అంటుకుంటాయి. అన్నం వండేటప్పుడు ప్లాస్టిక్ బియ్యం ఉపయోగిస్తే అది గంజిలో కలవదు. నీళ్లు వేడిగా ఉండటం వల్ల ముద్దలుగా మారుతుంది.



### యాదవ్‌ల కంచుకోటలో

# సీఎం నీతీశ్‌కు పరీక్ష..!

బిహార్‌లో ఆ నియోజకవర్గం యాదవ్‌ల కంచుకోట. అక్కడ 1967 నుంచి యాదవేతరులు ఒక్కసారి కూడా గెలవలేదు. గతంలో లాలూ ప్రసాద్ యాదవ్, శరద్ యాదవ్ నేతృత్వం వహించిన ఈ స్థానం.. ప్రస్తుతం బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌కు రాజకీయ పరీక్షగా నిలవనుంది. అదే మాధేపుర నియోజకవర్గం.

ఒకప్పుడు ఆర్జేడీకి కంచుకోట..

ఈ నియోజకవర్గంలో మొత్తం 14 లక్షలకుపైగా ఓటర్లు ఉండగా.. దాదాపు 5 లక్షల మంది యాదవ్‌లు, రెండు లక్షల మంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఆర్జేడీకి సంప్రదాయక ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉండేది. 2009లో లాలూ యాదవ్ పక్కకు తప్పుకోవడంతో అది మారిపోయింది. అయితే.. 2014లో మోదీ సునామీలో కూడా ఈ స్థానాన్ని ఆర్జేడీ తిరిగి కైవసం చేసుకుంది. 2019లో మోదీ ఫ్యాక్టర్ కారణంగా యాదవ్ ఓటర్లు జేడీయూ అభ్యర్థి దినేశ్ యాదవ్‌వైపు నిలవడంతో గెలుపొందారు. ప్రస్తుతం ఆయనే మరోసారి ఆ పార్టీ తరఫున బరిలో ఉన్నారు.

నీతీశ్‌కు పరీక్ష ఎందుకంటే..?

ఈ నియోజకవర్గంలో విజయం నీతీశ్ నాయకత్వానికి పరీక్షగా మారింది. సిటింగ్ ఎంపీగా ఉన్న దినేశ్ యాదవ్‌పై వ్యతిరేకత ఉందని.. ఆయనకు ప్రజల్లో పెద్దగా ఆదరణ లేదని భాజపా నేతలు చెబుతున్నారు. మోదీ ఆదరణ, రాజ్‌పుత్‌లు, ఓబీసీల మద్దతు భాజపాకు ఉన్నప్పటికీ.. యాదవ్‌ల నుంచి వ్యతిరేకత ఇక్కడ ఎన్‌డీఏ కూటమికి నష్టం కలిగించొచ్చని కమలం పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీంతో ఇక్కడ తమ అభ్యర్థిని గెలిపించుకోవడం బిహార్ సీఎంకు పరీక్షగా మారింది. తన ప్రభుత్వం పట్ల ప్రజల్లో మద్దతు ఏ మాత్రం తగ్గలేదని నిరూపించుకోవాల్సి ఉంటుంది. "ఇక్కడ యాదవ్‌లు ఎక్కువ. వారంతా ఒకప్పుడు ఆర్జేడీ వైపు మొగ్గు చూపేవారు. కానీ.. 2009లో నీతీశ్ కుమార్‌కు ఉన్న ఆదరణతో జేడీయూ అభ్యర్థిగా శరద్ యాదవ్ గెలుపొందారు. 2019లో మోదీ పాపులారిటీతో దినేశ్ యాదవ్ విజయం సాధించారు. అయితే.. అప్పటి నుంచి చాలా మార్పులు వచ్చాయి. మంచి అడ్మినిస్ట్రేటర్ అనే ఇమేజ్ నీతీశ్‌కు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందా?" అనేదే ఇక్కడ ప్రశ్న అని ఓ భాజపా నేత పేర్కొన్నారు. అందుకే ఈ స్థానంలో విజయం బిహార్ సీఎంకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇక్కడ ఆర్జేడీ నుంచి కుమార్ చంద్రదీప్ బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మూడో విడతలో భాగంగా మే7న పోలింగ్ జరగనుంది. 2019లో మొత్తం 40 సీట్లలో 39 గెలుచుకున్న ఎన్‌డీఏ కూటమి ఇప్పుడు గంగా నదికి దక్షిణ ప్రాంతంలో, రాష్ట్రంలో ఉత్తర భాగాన ఉన్న ప్రాంతాల్లో ఇండియా కూటమి మహాగఠ్‌బంధన్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటోంది.



## ఐసీఎస్ఈ 10, 12 ఫలితాలు విడుదల

ఐసీఎస్ఈ (పదో తరగతి), ఐఎస్‌సీ (12వ తరగతి) ఫలితాలను 'కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ ఆఫ్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ బోర్డు' సోమవారం విడుదల చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను results.cisce.org అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. కెరీర్స్ పోర్టల్, డిజిలాకర్‌లోనూ స్కోర్‌కార్డులు పొందొచ్చు. ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల షెడ్యూల్‌ను సైతం బోర్డు విడుదల చేసింది. ఆ పరీక్షలు జులైలో జరగనున్నాయి. విద్యార్థులు తమ యూఐడీ, ఇండెక్స్ నంబర్‌లతో పాటు క్యాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు. పదో తరగతిలో బాలికలు 99.65 శాతం, బాలురు 99.31 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. 12వ తరగతిలో ఇవి వరుసగా 98.92 శాతం, 97.53 శాతంగా ఉన్నాయి. రెండింట్లోనూ బాలికలదే పైచేయి కావడం విశేషం. ఐసీఎస్ఈ పరీక్షలు మార్చి 28తో; ఐఎస్‌సీ పరీక్షలు ఏప్రిల్ 13తో ముగిసిన విషయం తెలిసిందే.

సీబీఎస్ఈ ఫలితాలు ఎప్పుడంటే?


లక్షలాది మంది విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) 10, 12వ తరగతి పరీక్షలను మే 20 తర్వాతే వెల్లడించే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు ఇటీవల తెలిపారు. ఈ ఏడాది సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13 వరకు; 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగాయి. దేశవ్యాప్తంగా దాదాపు 39 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

## కొన్ని రోజుల్లో పెండ్లి.. వైద్య పరీక్షల్లో పురుషుడిగా తేలిన మహిళ!

కొన్ని రోజుల్లో పెండ్లి చేసుకోవాల్సిన ఆమె.. తన పొట్టలో వృషణాలున్నాయని తేలడంతో కంగుతింది. చివరికి ఆపరేషన్ ద్వారా వాటిని తొలగించుకొంది. చైనాలోని హుబీ ప్రావిన్స్‌లో ఈ వింత చోటు చేసుకొంది. సదరు యువతి పుట్టుకతో వచ్చే అడ్రినల్ గ్రంథి వ్యాధితో బాధ పడుతున్నదని వైద్యులు తెలిపారు. ఆమెకు 18 ఏండ్లప్పుడు అసాధారణ హార్మోన్లు ఉన్నాయని తేలింది. ఆమె యవ్వనంలో అడుగు పెట్టినప్పటి నుంచి స్తనాల పెరుగుదల సరిగా లేకపోవడంతో క్రోమోజోముల పరీక్ష చేయించాలని వైద్యులు సూచన చేశారు. అయితే యువతి తల్లిదండ్రులు దాన్ని పెడచెవిన పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పెండ్లికి ముందు వైద్య పరీక్షలు చేయించడంతో తమ కూతురు పురుషుడన్న విషయం వారికి తెలిసి వచ్చింది.

## సరికొత్త పాత్రలో కాజల్ అగర్వాల్?

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బాబీ కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ఐతే, ఈ చిత్రంలో ఇప్పుడు మరో హీరోయిన్ కనిపించబోతుంది. హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే ఓ కీలక పాత్రలో నటించబోతుంది. ఐతే, ఆమె పాత్ర హీరోయిన్ పాత్ర కాదు అని, ఓ సరికొత్త పాత్రలో కాజల్ అగర్వాల్ నటించబోతుంది అని తెలుస్తోంది. ముఖ్యంగా కాజల్ అగర్వాల్ పాత్ర నెగిటివ్ షేడ్స్ తో ఉంటుందని టాక్. ఈ పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేశాడట. కాగా ఈ చిత్రంలో ఊర్వశి రౌటేలా, బాబీ డియోల్, చాందిని చౌదరి మరియు ఇతరులు ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగ వంశీ, ఫార్చూన్‌ఫోర్ సినిమాపై సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.





## మాటలు రాని కొడుకును మొసళ్లకు విసిరేసింది!

కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, దండెలి తాలూకాలో తల్లిదండ్రుల మధ్య ఘర్షణ ఆరేళ్ల బాలుడి ప్రాణాలను తీసింది. జన్మతః మూగవాడైన ఈ బాలుడిని కన్న తల్లి సావిత్రి (26) మొసళ్లు ఉన్న కాలువలో విసిరేసింది. 'మూగవాడిని ఎందుకు కన్నావు?' అంటూ తరచూ భార్యను భర్త రవి కుమార్ (27) వేధిస్తూ ఉండేవాడు. 'వాడిని పారేయ్' అని అనేవాడు. శనివారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె తన కొడుకును తీసుకెళ్లి, కాలువలోకి విసిరేసింది. పోలీసు లు ఆదివారం బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై తీవ్రమైన గాయాలు, మొసలి కొరికినట్లు గుర్తులు ఉన్నాయి. ఓ చెయ్యి కనిపించలేదు.



### ఉత్తరాఖండ్‌లో నీటి కొరత..

## కార్ల వాషింగ్‌పై నిషేధం

ఓవైపు ఎండలు మండిపోతుండటంతో పాటు మరోవైపు గత శీతాకాలంలో తక్కువ వర్షపాతం, హిమపాతం నమోదుతో నీటి సంక్షోభం తీవ్రమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. నీటితో కార్లను కడుగటంపై నిషేధం విధించింది. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. అన్ని వర్క్‌షాపుల్లో నీటితో బదులుగా కార్లను డ్రైవాష్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. డెహ్రాడూన్, నైనిటాల్, చంపావత్ సహా ఆరు నగరాల్లో తీవ్ర నీటి సంక్షోభం నెలకొన్నది. ప్రజలు నీటి ట్యాంకర్లపై ఆధారపడు తున్నారు. 317 గ్రామాలు, 148 పట్టణ ప్రాంతాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అర్వింగ్ హ్యాంకి వెల్లడించారు. హిమనీనదాలతో పాటు రాష్ట్రంలోని పలు ఇతర నదుల్లో కూడా నీటి ప్రవాహం తగ్గింది. ఈ నేపథ్యంలో పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు సూచించారు.